క్లుప్తంగా...

నేడు అలయ్ బలయ్

రాజేంద్రనగర్: ఈ నెల 27న ఆలయ్ బలయ్ ముదిరాజ్ మహాసభను నిర్వహించనున్నట్లు ముదిరాజ్ మహాసభ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు హిమాయత్‌సాగర్ బంగారు సొడమ్మ దేవాలయం వద్ద ఆలయ్ బలయ్ ముదిరాజ్ మహాసభ కొనసాగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరవుతారన్నారు.

మాజీ సర్పంచ్‌కు మంత్రి పరామర్శ



శంషాబాద్: సుల్తాన్ పల్లి గ్రామ మాజీసర్పంచ్ యాటకారి సిద్దేశ్వర్‌ముదిరాజ్ తల్లి మృతిచెందడంతో వారి కుటంబాన్ని గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పరామర్శించారు. మంత్రితో పాటు మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్యతదితరులు కూడా సిద్దేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన యాత్రికులు గురువారం ఉమ్రా యాత్రకు బయలుదేరారు. అల్‌మిజాన్ సంస్థ పర్యవేక్షణలో సుమారు 90 యాత్రికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కోకాపేటలో అడ్వాన్స్ గ్రో హెయిర్ క్లినిక్



మణికొండ: హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో ప్రారంభించిన గ్రో హెయిర్, గ్లోస్కిన్ క్లినిక్‌కు మంచి ఆదరణ లభిస్తోందని డాక్టర్ బీఆర్ఎన్ పద్మిని పేర్కొన్నారు. దేశంలోనే లీడింగ్ హెయిర్ , స్కిన్ క్లినిక్ ఐటీ ప్రాంతానికి పక్కనే ఉన్న కోకాపేటలో నెలకొల్పటంతో స్థానికులు ఉత్సాహంగా వినియోగంచుకుంటున్నారని ఆమె గురువారం విలేకరులతో పేర్కొన్నారు. ప్రారంభ ఆఫర్‌గా ఉచిత కన్సల్టేషన్ ఇవ్వటంతో ప్రతి రోజు వందలాది మంది తమ క్లినిక్‌కు వస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్రాంఛైజీ భాగస్వాములు లక్ష్మీ సౌజన్య, సందీప్‌లు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

- వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డెవిస్



కవాతులో పాల్గొన్న డీసీపీ జోయల్ డెవిస్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డెవిస్ గురువారం ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. రౌడీ షీటర్ల నివాసాలకు వెళ్లి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ర్భంగా డీసీపీ మాట్లాడుతూ... ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట పరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు మరింత గస్తీని పెంచాలని ఆదేశించారు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వరావు, బోరబండ డీఐ భూపాల్‌గౌడ్, సెక్టార్ ఎస్ఐలు సర్దార్‌జమాల్, మనోజ్‌కుమార్, తూల్జారాం, సప్నారెడ్డి, టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసు అధికారులు పాల్గొన్నారు. బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, హబీబ్‌ఫాతీమానగర్‌ల మీదుగా శ్రీరాంనగర్ వరకు కవాతు కొనసాగింది.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

దెబ్బతిన్న హైదరాబాద్–బీజాపూర్ నేషనల్ హైవే



హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రమాద భరితంగా మారిన రోడ్లు

బండ్లగూడ: గోతులమయంగా మారిన రోడ్ల కారణంగా తరచూ ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నామని వాహనాదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను అధికారులకు వివరించినా పట్టుకోకుండా చోద్యం చూస్తున్నారని వెల్లడిస్తున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల పరిస్థితి రోజు రోజుకూ అధ్వానంగా మారిపోతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సైతం రోడ్లు గోతులమయంగా మారిపోయాయి. జాతీయ రహదారి కావడంతో వేల సంఖ్యలో ప్రతినిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేగంగా వచ్చే వాహనాలు ఈ గోతులను గమనించకుండా ప్రయాణిస్తుండడంతో తరచు ప్రమాదాలకు గురవుతున్నారు.

- హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్య రోజు రోజుకు జటిలమవుతుంది.
- వేల సంఖ్యలో ప్రతినిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు తదితర వాహనాలు ప్రయాణిస్తుంటాయి.
- కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు, బండ్లగూడ, హైదర్షాకోట్, టిపుఖాన్‌బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా గోతులమయంగా మారాయి.
- అనునిత్యం ప్రయాణిస్తున్న వాహనాదారులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.
- కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించి ప్రమాదాల తీవ్రతను ఆపాలని కోరుతున్నారు.





అమ్మవారి చీర వేలం

మైలార్‌దేవ్‌పల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జైమాతాది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి పదవ రోజు అంగరంగ వైభవంగా అమ్మవారి విగ్రహ నిమజ్జన ఉరేగింపు సందర్భంగా పూజలందుకొన్న పట్టు చీరను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం వేలం పాట నిర్వహించారు. గత సంవత్సరం 3 లక్షల 116 రూపాయలకు సొంతం చేసుకున్న స్థానిక నాయకులు సంకూరి జయప్రకాష్ పద్మశాలి ఈ సంవత్సరం ఏకంగా 3 లక్షల 75 వేలకు మరోసారి కైవసం చేసుకున్నారు.

రేపు తారామతి బారాదరిలో నాట్య తోరణం

గోల్కొండ: ఈనెల 28న గోల్కొండ తారామతి బారాదరిలో నాట్య తోరణం నిర్వహిస్తున్నామని అమృత కల్చరల్ ట్రస్ట్ మెనేజింగ్ ట్రస్టీ భార్గవి పగడాల తెలిపారు. హైదరాబాద్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహిని అట్టం, ఒడిసీ, కథక్‌లతో పాటు నాట్య గురువు కళా కృష్ణ బృందం పేరిణి శివతాండవం కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నాట్య ప్రదర్శనకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. నాట్యరంగంలో ఉత్సాహవంతులైన యువతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, డీఐజీ సుమతి తదితరులు పాల్గొంటారని ఆమె వివరించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గౌలిపురా: ఈఎంఆర్ఐ (108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ (ఈఎంటీ) ఉద్యోగానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు ప్రోగ్రామ్ మేనేజర్ జాన్‌షాహీద్‌షేక్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జి రాక్స్ సెట్‌ను తీసుకుని ఈనెల 27న ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్‌కు జీఎన్ఎం, ఏఎన్ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, బీఎస్సీ (బీజెడ్సీ) అర్హతలు కలిగి ఉండి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. కింగ్‌కోఠిలోని 108 రీజినల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నాం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9000001674.

31న 'నేను నా రచనలు'

సుల్తాన్‌బజార్: 'నేను నా రచనలు' అనే కొత్త కార్యక్రమాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రారంభించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత కవి రచయితలు, పరిశోధకులు, విమర్శకుల స్వీయజీవి త, సాహిత్య విశేషాలను పాఠకులతో పంచుకునే ప్ర సంగ పరంపర అనే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 31న సా.5.30 గంటలకు పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సలీం మొదటి వక్తగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు గురువారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరాయి. నియోజకవర్గం పరిధిలోని 535 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను అధికారులు యూనివర్సిటీలోని ఎన్‌సీసీ గ్రౌండ్ ప్రాంతంలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చారు. గత కొన్ని రోజులుగా రాజేంద్రనగర్‌లోని జిల్లా ఈవీఎం గోదాములో 8 నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీజ్ చేశారు. వీటన్నింటి ఆయా ప్రాంతాల్లో కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ ఈవీఎం గోదామ్ నుండి చెవేళ్ల, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, ఎల్‌బీనగర్, మహేశ్వరంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరిచారు. మొత్తం 3,300 ఈవీఎంలను ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల్లో కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లకు భారీ బందోబస్తు నడుమ తరలించారు. ఈ తరలింపు ప్రక్రియ బుధవారం రాత్రి వరకు సాగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను బందోబస్తు మధ్య అధికారులు ఎన్‌సీసీ గ్రౌండ్, వెటర్నరీ కళాశాల భవనం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఎన్నికల అధికారులు, పోలీసుల సమక్షంలో వీటిని భద్రపరిచి సీల్ వేశారు. ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలతో పాటు ఎన్నికల సామగ్రిని తరలించనున్నారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు నేపథ్యంలో రాజేంద్రనగర్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో ఇక్కడ పికెట్ ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పోలీసుల పహారాలో ఈ స్ట్రాంగ్ రూమ్ నిఘాలో ఉండనుంది.

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఎఫ్‌సీసీ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఖాలీద్‌అలీఖాన్

గోల్కొండ: సమాజ సేవా కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనాలని దీన్ని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ జీఎంకే ప్రైమ్ గార్డెన్‌లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ గత 13 ఏళ్లుగా తమ ఆర్గనైజేషన్ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను ఆయనకు వివరించారు. వందలాది కూలే కాపురాలను కౌన్సిలింగ్ ద్వారా తాము నిలబెట్టామన్నారు. కుటుంబ కలహాలతో తమ దగ్గరకు వచ్చిన వారిని పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించి వారు కలిసిమెలిసి ఉండేలా చూశామన్నారు. ప్రతిభ ఉండి చదువులకు నోచుకోని నిరుపేదలు ఎందరో ఉన్నారని ఇటువంటి వారికి సరైన మార్గదర్శనం చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి తన మద్దతు ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిఎఫ్‌సిఓ ఎమ్మెల్యేను సన్మానించి మెమోంటో అందజేశారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ పార్టీ కమిటీ ప్రతినిధులకు మెమోంటోలను అందజేశారు. టీఎఫ్‌సిఓ ప్రతినిధి ఖాలీద్ అలీఖాన్, పాషాభాయ్, షకీల్ అలీఖాన్, ఆరూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు 28న..

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఏడు మేనేజింగ్ కమిటీ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, మహిళల కోటాలో ఉన్న ఇద్దరు మెంబర్లకు గాను ఒకరు మాత్రమే నామినేషన్ వేయగా సి.విద్యాధరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఆరు మేనేజింగ్ కమిటీ సభ్యులకు గాను ఓపెన్ కేటగిరిలో నాలుగింటికి 9 మంది అభ్యర్థులు.. అబ్దుల్ రహమాన్, సి.నర్సయ్య, ఎస్.నారాయణ, ఎం.నీలంకఠరావు, బాలయ్య దాసరి, రాము నాయుడు.వి, పి.వెంకట్రావ్, ఏకె శర్మ, సుబ్బారావు కేవీ పోటీ పడుతున్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ విభాగంలో ఒక మెంబర్‌కు గాను చింత రాములు, ఎస్ కరుణాకరరావులు పోటీ పడుతున్నారు.

ఈనెల 28న పోలింగ్

బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి మాధవరెడ్డి తెలిపారు. హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో 277 మందికి ఓటుహక్కు ఉన్నట్లు వివరించారు. కాలనీలోని శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నాం 3 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 3.30 గంటల నుంచి కౌంటింగ్ చేస్తామన్నారు.

చెన్నై విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్ : హైదరాబాద్ నుంచి చెన్నై బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి చెన్నైకు బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాన్ని కర్నూలు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలోని ప్రయాణికులు రోడ్డు మార్గంలో తిరిగి హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా వారిని ప్రత్యామ్నాయ విమానాల్లో చెన్నైకు పంపారు.

'మనూ'లో జెండర్ చాంపియన్స్ క్లబ్ ప్రారంభం



రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో జెండర్ ఛాంపియన్స్ క్లబ్‌ను యూనివర్సిటీ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుప్తా షాహీన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో షాహీన్ మాట్లాడుతూ లింగ సమానత్వం, సమ్మిళితతను ప్రోత్సహించే లక్ష్యంతో 'మనూ' కమ్యూనిటీకి లింగంతో సంబంధం లేకుండా మంచి వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత, హక్కులకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు సెమినార్లు, వర్క్‌షాప్‌లను, అవగాహన ప్రచారాలను నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉర్దూ విశ్వవిద్యాలయం స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. సయ్యద్ అలీమ్ అష్రఫ్, జాయింట్ డీన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ, సమావేశం నోడల్ అధికారిణి సబాఖాతూన్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

చార్మినార్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని చార్మినార్ జోన్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరించారు. గురువారం జోన్ పరిధిలోని బస్తీ దవాఖానాలకు చెందిన వైద్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ తప్పనిసరిగా సమయానికి ఆయా బస్తీ దవాఖానాలలో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. సమయానికి రావడమే కాకుండా రోజూ 5 మందికి టెలి మెడిసిన్స్ కాల్స్ చేయడం, దవాఖానాలలో సరిపడా మందులను అందుబాటులో ఉంచుకుని అవసరమైన ప్రతి రోగికి మందులను అందజేయాలన్నారు. మహిళలకు ఇతరాత్ర ఆరోగ్య సమస్యలున్నట్టు తెలిస్తే.. వెంటనే వారిని దగ్గరలోని యూపీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. యూపీహెచ్‌సీలలో 70 శాతం డెలివరీలను నార్మల్‌గా జరిగేటట్లు చూడాలన్నారు. డాక్టర్ సునంద, డాక్టర్ బ్రిడ్జిస్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ రఫీక్ తదితరులున్నారు.

యువతలో గుండె సంబంధిత మరణాలు పెరుగుతున్నాయి

- సెమి డైరెక్టర్ డా.హరిప్రసాద్
- సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా జూబ్లి ఉత్సవాలు



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

మాదాపూర్: ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీనింగ్‌పై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల యువతలో గుండె సంబంధిత మరణాలు పెరుగుతున్నాయని సెమి (సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా) డైరెక్టర్ డాక్టర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా 25 సంవత్సరాల జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2వేల మంది విద్యార్థులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)లో సామూహిక శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్‌ను నిర్వహించింది. కార్డియాక్ ఎమర్జెన్సీలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చింది. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలస్యంగా ఆసుపత్రిలో చేరడం ద్వారా ప్రాణాలు పోతున్నాయని కార్డియాక్ ఎమర్జెన్సీలో ప్రతి నిమిషం ముఖ్యమని తెలిపారు. సీపీఆర్ రక్తాన్ని ముఖ్యమైన అవయవాలకు ప్రవహింపజేస్తుందని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సెమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. శరవణకుమార్, సెమి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.కె. సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ జవాన్లు

హఫీజ్‌పేట్/శేరిలింగంపల్లి : ప్రజలు తమ ఓటు హక్కును వియోగించుకోవాలని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మియాపూర్ ఏసీపీ నర్సింహారావు ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బృందంతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మాదాపూర్ డీసీపీ సందీప్‌ల ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టామన్నారు. ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. లింగంపల్లిలోని తుల్జాభవానీ దేవాలయం నుంచి లింగంపల్లి గ్రామం, ఆదర్శనగర్, నెహ్రూనగర్, గోపినగర్, పాపిరెడ్డికాలనీ, సురభీనగర్ వరకు సుమారు 3 కిలో మీటర్ల వరకు మార్చ్ నిర్వహించారు. మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, చందానగర్, మియాపూర్, ఆర్సీపురం సీఐలు పాలవెల్లి, ప్రేమ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, డీఐలు కాంతారెడ్డి, వెంకటేష్, ఎస్ఐలు, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పిఎఫ్ పోలీసులు, జవాన్లు పాల్గొన్నారు.

నువ్వే.. కావాలి

- ఇద్దరితో ప్రేమాయణం.. మరో యువతితో నిశ్చితార్థం
- పోలీసుల వద్దకు పంచాయితీ
- నువ్వే కావాలంటూ యువతుల గొడవ
- తలలు పట్టుకున్న పోలీసులు.. చివరకు రిమాండ్

వెంగళరావునగర్: నగరంలో ఇద్దరు యువతులను మోసం చేసి మూడో యువతితో పెళ్లితంతుకు సిద్ధమైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే అతను నాకు మాత్రమే సొంతమంటూ ఇద్దరు యువతులు కేసు పెట్టిన విచిత్రమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఏపీలోని రాయచోటి ప్రాంతానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అనే యువకుడు మాదాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేసేవాడు. అదే ఆస్పత్రిలో పని చేసే యువతి అతనికి పరిచయం అయింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెంగళరావునగర్ డివిజన్‌లోని ఒక బస్తీలో నివాసం ఉంటున్న యువతి వద్దకు పలుసార్లు వచ్చాడు. కొన్ని రోజుల తర్వాత ఆమెకు చెప్పకుండా కార్ఖానాలోని మరో ఆస్పత్రిలో చేరాడు. అక్కడ పనిచేసే మరో యువతితో సేమ్ సీన్ రిపీట్ చేశాడు. కట్ చేస్తే... (ఈ నెల 6న) ఎవరికీ చెప్పకుండా స్వగ్రామం వెళ్లాడు. అక్కడే తన ఇంటి పక్కనే ఉంటున్న యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ నెల 24న నిశ్చితార్థం చేసుకోవాలనుకుని అనుకున్నాడు. పక్కాగా ప్లాన్ చేసి ఉంగరాలు, దండలు మార్చుకోవాలనుకునే సమయంలో సినీ ఫక్కీలో మధురానగర్ ఎస్ఐ ఇక్బాల్ రంగ ప్రవేశం చేశారు. నిశ్చితార్థాన్ని చివరి నిమిషంలో అడ్డుకున్నాడు. బంధువులు, కుటుంబసభ్యులకు ఫ్లాష్‌బ్యాక్ మొత్తం చెప్పి నిందితుడిని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ఫక్రుద్దీన్‌ను మధురానగర్‌కు తీసుకువచ్చారని తెలుసుకున్న బాధిత యువతులు బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అర్ధరాత్రి వరకు వీడు నా వాడు.. కాదు నా వాడంటూ ఇద్దరూ వాదులాడుకున్నారు. దీంతో పోలీసులు అయోమయంలో పడ్డారు. ముందుగా నేను మోసపోయాను, కాబట్టి నాకే సొంతమంటూ ఒకరు, కాదు నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు నాకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఇరువురూ తమ ఆవేదను తెలియజేశారు. చివరకు పోలీసులు ఎగ్బాల్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

- కాలి బూడిదైన ఫ్లాట్
- ఇంట్లో ఎవరూ లేక పోవటంతో తప్పిన ప్రాణా పాయం

మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లోని ఐదవ అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాప్తించిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి, పుప్పాలగూడలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కూలీ కుద్బుద్దీన్ కాలనీలో సాయి శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తులోని 502 ఫ్లాట్‌లో గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అటుగా వెళుతున్న వారు గమనించి మున్సిపల్, అగ్నిమాపక శాఖలకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు వచ్చి ఫ్లాట్‌లో వ్యాపించిన మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగి ఉండవచ్చని వారు అభిప్రాయపడ్డారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోయినా, ఫ్లాట్ పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఆస్తినష్టం వివరాలను మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక అధికారులు అంచనా వేస్తున్నారు.

డంపింగ్ యార్డుగా చారిత్రక ప్రదేశాలు

గోల్కొండ: చారిత్రక ప్రదేశాలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. గోల్కొండ కోట ప్రహరీకి ఆనుకుని ఉన్న కందకాలు డంపింగ్ యార్డులుగా మారాయి. రోజూ టన్నుల కొద్ది వ్యర్థాలు, చెత్త ఈ ప్రాంతాలలో రాత్రి సమయంలో డంపింగ్ అవుతోంది. గోల్కొండ లోపలికి వచ్చే చారిత్రక మోతీదర్వాజ, బంజారి దర్వాజ, జమాలి దర్వాజ పరిసరాల్లో సైతం యదేచ్ఛగా వ్యర్థాల డంపింగ్ జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జమాలీ దర్వాజ, బంజారి దర్వాజను ఆనుకోని ఉన్న కందకాలాలో సైతం వ్యర్థాలు డంపింగ్ అవుతున్నాయి. కాగా కేంద్ర పురాతత్వ శాఖ వారు కందకాలు, దర్వాజాల వద్ద ఫెన్సింగ్ వేసి చేతులు దులుపుకున్నారే తప్పా.. అక్కడి వ్యర్థాలు డంపింగ్‌ను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గోల్కొండ కోట ప్రహరీపై వ్యర్థాలు ఇలా..